సాక్షి
తిరుపతి
గురువారం । 23 । ఫిబ్రవరి । 2023





తిరుపతి బులియన్

బంగారం :

| | |
|---|---|
| 24 క్యారెట్లు 10 గ్రాములు | రూ.58,170 |
| 22 క్యారెట్లు ఒక గ్రాము | రూ.5,196 |

వెండి:

| | |
|---|---|
| హోల్‌సేల్ ధర (కిలో) | రూ.67,800 |
| రిటైల్ వెండి గ్రాము | రూ.69.80 |

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| తిరుపతి | 34 | 16 |
| చిత్తూరు | 34 | 17 |
| తిరుమల | 31 | 19 |
| గూడూరు | 34 | 19 |
| నగరి | 35 | 18 |



### పరమ పావనం.. గిరి ప్రదక్షిణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం నూతన వధూవరులైన ఆదిదంపతులు బుధవారం ఉదయం కైలాసగిరి ప్రదక్షిణ చేశారు. కొండచుట్టు ఉత్సవంలో విదేశీ భక్తులు సందడి చేశారు.

8లో▸

# సరికొత్తగా సాగుదాం!



అన్నదాతకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటూ వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలుస్తోంది. విత్తనాల పంపిణీ నుంచి ధాన్యం కొనుగోలు వరకు చేయూతనందిస్తోంది. విప్లవాత్మకమైన పథకాలతో సాగును సంబరంగా మార్చేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది. అందులో భాగంగా ఆధునిక సేద్యం దిశగా రైతులను నడిపిస్తోంది. ఇందుకు అవసరమైన పరికరాలను రాయితీపై సమకూరుస్తోంది. తాజాగా డ్రోన్ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకువచ్చి సాగును మరింత సులభతరం చేస్తోంది. తక్కువ ఖర్చుతో పురుగుమందులు పిచికారీ చేసుకునే వెసులుబాటు కల్పిస్తోంది. ఈ క్రమంలోనే రూ.10లక్షల విలువైన డ్రోన్ స్ప్రేయర్లను 40–50శాతం సబ్సిడీపై పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. నూతన సాంకేతికతను రైతులు అందిపుచ్చుకునేలా తగిన శిక్షణ అందించేందుకు చర్యలు చేపట్టింది. ఇందుకోసం ప్రత్యేకంగా జిల్లాలో ఐదుగురు డ్రోన్ పైలెట్‌లను నియమించింది. వీరి ద్వారా డ్రోన్ వినియోగంతో చేకూరే లాభాలపై రైతులకు అవగాహన కల్పించేలా దిశానిర్దేశం చేసింది. – తిరుపతి అర్బన్

- ఆధునిక వ్యవసాయానికి ప్రభుత్వ ప్రోత్సాహం
- డ్రోన్ స్ప్రేయర్లతో సేద్యం మరింత సులభం
- రైతులకు అవగాహన కల్పించేందుకు పైలెట్ల నియామకం
- రాయితీపై పరికరాల పంపిణీకి సన్నద్ధం

**బహుళ ప్రయోజనాలు**



డ్రోన్ స్ప్రేయర్‌తో క్రిమి సంహారక మందులను పిచికారీ చేయడమే కాకుండా మినుములు,పెసలు తదితర విత్తనాలు చల్లడం, యూరియా, పాస్పేట్ వేయడానికి ఉపయోగించవచ్చును. ఎకరా సాగుకు 30–40 కేజీల విత్తనాలు చల్లుతుంటాం. అయితే డ్రోన్‌తో 12–16కేజీలు సరిపోతాయి. మరోవైపు యూరియా, పాస్పేట్స్ చేతితో చల్లితే ఏకరాకి 50 కేజీలు వేయాల్సి వస్తుంది.డ్రోన్‌తో అయితే 25 కేజీలు చాలు. ఇలా డ్రోన్లతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.

– ఉదయప్రతాప్, డ్రోన్ పైలెట్, చంద్రగిరి

**ప్రయోజనాలు తెలియజేస్తున్నాం**



మాది వ్యవసాయ కుటుంబం, నేను కూడా అదే బాటలో నడుస్తున్నా. బీకాం వరకు చదివినా, ఉద్యోగం చేయడం కంటే స్వగ్రామంలో తల్లిదండ్రులకు అండగా ఉంటూ వ్యవసాయం చేసుకోవాలని భావించా. ఈ తరుణంలో ప్రభుత్వం డ్రోన్ల స్ప్రేయర్లు అందుబాటులోకి తీసురావడంతో వాటిపై ఆసక్తి పెరిగింది. వెంటనే వ్యవసాయశాఖ అధికారులను కలిశా. నన్ను పైలెట్‌గా ఎంపిక చేసి, గుంటూరులో శిక్షణ ఇప్పించారు. త్వరలోనే సబ్సిడీపై పంపిణీ చేసే డ్రోన్లు రానున్నాయి. వాటి ప్రయోజనాలను ఇప్పటికే రైతులకు తెలియజేస్తున్నాం. ఇందుకోసం ఐదుగురు సభ్యులతో గ్రూపుగా ఏర్పడ్డాం. డ్రోన్లను మేము వినియోగించుకోవడంతోపాటు పలువరు రైతులకు ఉపయోగపడుతున్నాం. అలాగే మాకు కూడా ఉపాధి లభిస్తుందని భావిస్తున్నాం.

– మురళీకృష్ణారెడ్డి, డ్రోన్ పైలెట్, దక్కిలి

**ఖర్చు తక్కువ.. సమయం ఆదా**



డ్రోన్ వినియోగంతో ఖర్చు తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుంది. తెగుళ్ల నివారణ కోసం ఒక ఎకరా వరి పంటకు లీటర్ క్రిమిసంహారక మందు పిచికారీ చేయాలి.అదే డ్రోన్ వాడితే 60శాతం మందు (600 గ్రాములు )సరిపోతుంది. అంతేకాదు ఎకరాకి సాధారణ స్ప్రేయర్లతో పిచికారీ చేయడానికి 200లీటర్లు నీరు ఉపయోగించాలి. డ్రోన్‌తో 10 లీటర్లు సరిపోతాయి. మరోవైపు సాధారణ స్ప్రేయర్‌తో ఎకరాకు మందు పిచికారీ చేసేందుకు గంట పడితే, డ్రోన్‌తో 10 నిముషాల్లోనే పూర్తవుతుంది. డ్రోన్ స్ప్రేయర్ నుంచి విడుదల అయ్యే ఒక నీటి చుక్క 27 తుంపర్లుగా వరి పంటపై పడుతుంది. దీంతో తెగుళ్లు త్వరగా మాయం అవుతాయి.

– వెంకటేష్, డ్రోన్ పైలెట్, బీఎన్ కండ్రిగ

**మార్పు ఆశాజనకం**



వ్యవసాయంలో ఆశాజనకంగా మార్పులు వస్తున్నాయి. ముఖ్యంగా డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం రైతులకు శుభపరిణామం. నూతన విధానంలో నేను కూడా భాగస్వామిని కావడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఎప్పటికప్పుడు రైతులకు డ్రోన్ల వినియోగంతో చేకూరే ఉపయోగాలను వివరిస్తున్నా. దీంతో సాగు మరింతగా పెరుగుతుందని భావిస్తున్నా.

– తిరుపాల్, డ్రోన్ పైలెట్, ఏర్పేడు

**సంతృప్తిగా ఉంది**



తాతల కాలం నుంచి వ్యవసాయమే మా కుటుంబానికి ఆధారం. గతంలో ప్రతి చిన్న విషయానికీ వ్యవసాయశాఖ అధికారుల సూచనలు తీసుకునే వాళ్ల. డ్రోన్ పైలెట్‌గా శిక్షణ పొందడంతో మా మండలంలో పలువురు రైతులు, స్నేహితులకు డ్రోన్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్నా. వారికి వివరించడం ఎంతో సంతృప్తిగా ఉంది. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు అమలు చేస్తే సేద్యం సులభంగా మారుతుంది.

– మనోహర్, డ్రోన్ పైలెట్, నాగలాపురం

## న్యూస్‌రీల్

### హైదరాబాద్‌కు 'వెన్నెల' బస్సులు



కొత్త బస్సుల వద్ద బాలాజీ, రామచంద్రనాయుడు

**తిరుపతి అర్బన్ :** హైదరాబాద్‌కు వెళ్లే ప్రయాణికుల కోసం శుక్రవారం నుంచి రెండు వెన్నెల ఏసీ స్లీపర్ బస్సులు నడపనున్నట్లు తిరుపతి ఆర్టీసీ డీఎం బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాత్రి 9.30, 10 గంటలకు బస్సులు బయలుదేరుతాయని, కడప మీదుగా హైదరాబాద్‌లోని బీహెచ్‌ఈఎల్‌కు చేరుకుంటుందన్నారు. టికెట్ ధర రూ.1,810లుగా నిర్ణయించామని, అందులో 20శాతం రాయితీ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆన్‌లైన్‌లో కూడా టికెట్ బుక్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు వివరించారు. సమావేశంలో ఏటీఎం రామచంద్రనాయుడు ఉన్నారు.

### పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**తిరుపతి అర్బన్ :** జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కొత్త పరిశ్రమల స్థాపనకు సకాలంలో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సింగిల్ డెస్క్ విధానంలో తిరుపతి జిల్లా ఏర్పడినప్పటి నుంచి 502 పరిశ్రమలకు గాను 465 అనుమతులు ఇచ్చామని మరో 13 పరిశీలనలో ఉన్నాయని వివరించారు. కమిటీకి సిఫారసు చేసిన క్లెయిమ్స్ ప్రకారం 32 పరిశ్రమలకు రూ.2.198 కోట్ల ప్రోత్సాహకాలు అందించనున్నట్లు వెల్లడించారు. ఏర్పేడు మండలం మాధవమాలలో ఉడ్ కార్వింగ్ క్లస్టర్, రేణిగుంట మండలం ఎర్రమరెడ్డిపాళెంలో కాపర్ వేజెల్స్ క్లస్టర్, వెంకటగిరిలో శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యలపై సమీక్షించారు. సమావేశంలో తుడా వీసీ హరికృష్ణ, పరిశ్రమలశాఖ జిల్లా అధికారి ప్రతాప్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్లు చంద్రశేఖర్ , సుహానా సోని, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి రమణయ్య, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్ర బాబు పాల్గొన్నారు.

### ఆ తహసీల్దార్‌కు ఎన్నికల విధులు వద్దు

**చిత్తూరు రూరల్:** చిత్తూరు తహసీల్దార్ పార్వతిని ఎమ్మెల్సీ ఎన్నికల విధుల నుంచి తప్పించాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికలు పూర్తయ్యేంత వరకు దూరంగా ఉండాలని అందులో పేర్కొంది. కాగా ఎన్నికల విధులు తప్ప మిగిలిన విధి విధానాల్లో యథావిధిగా కొనసాగుతారని అధికారులు పేర్కొన్నారు.

### పూడి రైల్వే గేటు మరమ్మతులు పూర్తి



**వడమాలపేట :** మండల పరిధిలోని పూడి రైల్వే గేటు మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం నుంచి వాహనాలు రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి. గేటు ప్రాంతంలో గుంతలతో వాహనదారులు అవస్థలు పడేవారు. నాలుగు రోజులుగా రాత్రి పూట రాకపోకలు నిలిపివేసి ట్రాక్ మర మ్మతులు, తారురోడ్డు నిర్మాణ పనులు రైల్వే అధికా రులు పూర్తి చేశారు. ఇక వాహనదారులు సాఫీగా ప్రయాణం చేయవచ్చు.

### ఆక్రమిత భూముల పరిశీలన



భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

సాక్షి ఎఫెక్ట్..

**నగరి :** మండలంలోని ఓజీ కుప్పం గ్రామంలో ఆక్రమణకు గురైన భూములను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం సాయంత్రం పరిశీలించారు. బుధవారం 'సాక్షి'లో 'పేదల భూముల్లో పచ్చ గద్దలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. సిబ్బందితో ఆగ్రామానికి వెళ్లి భూములను పరిశీలించారు. అందరి వద్ద ఉన్న భూ రికార్డులను పరిశీలించి సర్వే చేస్తామన్నారు.

### పకడ్బందీగా ముఖ ఆధారిత నమోదు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

**తిరుపతి అర్బన్ :** జిల్లావ్యాప్తంగా ఉద్యోగుల ముఖ ఆధారిత నమోదును పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జేసీ బాలాజీ, డీఆర్‌ఓ శ్రీనివాసరావుతో కలిసి సమీక్షించారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఇప్పటి వరకు 80శాతం ఉద్యోగులను మాత్రమే నమోదు చేశారని, మిగిలిన 20శాతం త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఉదయం, సాయంత్రం సిబ్బందికి ముఖ ఆధారిత హాజరు తప్పనిసరని తెలిపారు. ఏదైనా సాంకేతిక సమస్యలు, సందేహాలు ఉంటే ఎన్ఐసీ వారిని సంప్రదించాలని సూచించారు. సమీక్షలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ జ్యోతి, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి శంకర్ నారాయణ, డీఎల్‌డీఓ సుశీలాదేవి, సహకారశాఖ అధికారి ఉమాదేవి, పౌరసరఫరాల మేనేజర్ సుమతి, డ్వామా అధికారి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

### 27 నుంచి బ్యాంకర్ల వర్క్‌షాప్

**తిరుపతి మంగళం :** ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, విడిభాగాల తయారీదారులకు అవసరమైన రుణాలను మంజూరు చేసేందుకు ఈ నెల 27, 28 తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్‌రంగ బ్యాంకర్లతో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ వి.విజయభాస్కర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి కరంబాడిరోడ్డులోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటుచేయనున్న వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 8328562229 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# జనం జేజేల నడుమ నామినేషన్



నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

- గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ
- అతిథులుగా పాల్గొన్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలం సురేశ్, ఆర్‌కేరోజా, కాకాణి గోవర్ధనరెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాస రెడ్డి
- తరలి వచ్చిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సీలు, ప్రజాప్రతినిధులు
- జైజగన్ నినాదాలతో మార్మోగిన చిత్తూరు

**చిత్తూరు కలెక్టరేట్ :** జనం జేజేల నడుమ ఉమ్మడి ప్రకాశం– నెల్లూరు–చిత్తూరు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులు పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి బుధవారం నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్‌ల దాఖలు అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో జిల్లా కేంద్రం నడిబొడ్డులో ఉన్న గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు ఆదిమూలం సురేశ్, ఆర్‌కే రోజా, కాకాణి గోవర్ధనరెడ్డి, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలి వచ్చి అభ్యర్థులకు స్వాగతం పలికారు. ర్యాలీకి వచ్చిన వారందరు వైఎస్సార్ సీపీపై అభిమానాన్ని చాటుకున్నారు. డప్పు నృత్యాలతో ప్రజలను ఆకట్టుకున్నారు. అభ్యర్థులు ప్రజలకు నమస్కారం చేస్తూ నామినేషన్ కేంద్రానికి విచ్చేశారు. కలెక్టరేట్ వద్ద ఎన్నికల నిబంధనల మేరకు అభ్యర్థులతో కొంత మందే లోపలికి వెళ్లారు. అనంతరం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్‌కు అభ్యర్థులు శ్యాంప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, చింతల రామచంద్రారెడ్డి, కోనేటి ఆదిమూలం, వరప్రసాద్, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, ఎమ్మెల్సీలు భరత్, కల్యాణ చక్రవర్తి, ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

**పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతు**

వైఎస్సార్‌టీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు పలు ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు, 1998 డీఎస్సీ సంఘం నాయకులు మద్దతు పలికి ఘనంగా స్వాగతం పలికారు. అలాగే చిత్తూరు నగరంలోని కట్టమంచి బ్రిడ్జి వద్ద నుంచి పీడీఎఫ్ పోటీ ఎమ్మెల్సీ అభ్యర్థులు బాబురెడ్డి, వెంకటేశ్వర రెడ్డిలతో పాటు యూటీఎఫ్, పలు వామపక్షపార్టీల నాయకులు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు నామినేషన్ దాఖలు చేశారు.



అభ్యర్థుల వెంట ర్యాలీగా వెళుతున్న ప్రజలు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

**భారీ మెజారిటీతో గెలిపించాలి**

మంత్రి రోజా, తిరుపతి ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేర్నేటి శ్యాం ప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. శ్యాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే గ్రాడ్యుయేట్‌ల సమస్యలపై గళం వినిపించి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

**సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి**

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్సీ,ఎస్టీ, బీసీ ఇతర అణగారిన అన్ని సామాజిక వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేసేలా అభ్యర్థులను ప్రకటించారని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి తెలి పారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే, అభ్యర్థులను గెలిపిస్తాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులు అఖండ విజయం సాధిస్తారని పేర్కొన్నారు.

**సీఎం జగన్‌తోనే సామాజిక న్యాయం**

ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేసిన ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటిస్తున్నారని పేర్కొన్నారు. వడ్డెర మాదిగ, మాల ఇలా అన్ని కులాలను గుర్తించి సీట్లు కేటాయించారని తెలిపారు. చంద్రబాబు కేవలం మాటల మనిషి అని విమర్శించారు. బీసీ ఓట్లతో గెలిచి బీసీలకు మొండి చేయి చూపించారని ఆరోపించారు. సీఎం జగన్ బీసీలకు పెద్దపీట వేసి ఇచ్చిన మాట నెరవేర్చారని తెలిపారు.

### ఓటర్ల జాబితా విడుదల

**చిత్తూరు కలెక్టరేట్ :** ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ల తుది జాబితాను రిటర్నింగ్ ఆఫీసర్, జేసీ వెంకటేశ్వర్ బుధవారం విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని శ్రీకాళహస్తి డివిజన్ పరిధిలో 155, తిరుపతి పరిధిలో 194, నగరి పరిధిలో 108, చిత్తూరులో 187, పలమనేరులో 222, కుప్పంలో 99, మదనపల్లెలో 255 మొత్తం 1220 మంది ఓటర్లు ఉన్నట్లు ఆయన ప్రకటించారు.

**చరిత్ర సృష్టించిన సీఎం**

బీసీలకు 61శాతం ఎమ్మెల్సీ అభ్యర్థుగా సీట్లు కేటాయించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చరిత్ర సృష్టించారని ఉమ్మడి చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి బీసీలకు పెద్దపీట వేస్తున్నారనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. మాటలు కాకుండా హామీలను సీఎం జగన్ చేతల్లో చూపించడంతో బీసీలందరూ అండగా ఉన్నారన్నారు.

## పట్టభద్రులకు 15 టీచర్‌కు 6

- పకడ్బందీగా ఎమ్మెల్సీ నామినేషన్ల స్వీకరణ
- నేటితో ముగియనున్న గడువు

**సాక్షి, చిత్తూరు :** గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం 21 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వైఎస్సార్‌సీపీ బలపరచిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేర్నాటి శ్యామ్‌ప్రసాద్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పర్వతనేని చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు. మొత్తం పట్టభద్రులకు 15, ఉపాధ్యాయ ఎన్నికలకు ఆరు నామినేషన్‌లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.

**పట్టభద్రులకు :** వైఎస్సార్‌సీపీ అనుబంధంగా పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, హేమ సుస్మిత పేర్నాటి, ఇండిపెండెంట్‌లుగా రాయపాటి జగదీశ్, పల్లిపట్టు అభినవ్ విష్ణు, గిరి శ్రీనివాసరావు, మీగడ వెంకటేశ్వరరెడ్డి, పంతంగి పాకంకరెడ్డి, వీరభద్రాచారి, దొడ్ల శ్రీహరి, పూసల రవి, అంకయ్య చౌదరి, శివప్రసాద్‌రెడ్డి, నక్కా దినేష్‌కంచర్ల శ్రీకాంత్ చౌదరి (టీడీపీ అనుబంధం), కంచర్ల సరిత (టీడీపీ అనుబంధం) నామినేషన్ వేశారు.

**ఉపాధ్యాయ స్థానానికి :** చంద్రశేఖర్‌రెడ్డి పర్వత రెడ్డి, ప్రవీణా పర్వతరెడ్డి, బ్రహ్మానందం, బాబురెడ్డి, ధనంజయ, చినరమణారెడ్డి నామినేషన్‌లు దాఖలు చేశారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ప్రతిపాదకులుగా మంత్రులు



నామినేషన్ అందిస్తున్న టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, ప్రతిపాదకులు

# పర్యావరణ పరిస్థితులపై సదస్సు



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ గీతాలక్ష్మి తదితరులు

**తిరుపతి ఎడ్యుకేషన్ :** ఎస్వీ వెటర్నరీ ఆడిటోరియంలో బుధవారం కోస్తా ప్రాంతంలో పర్యావరణ స్థితి స్థాపకత, పరిస్థితులపై జాతీయ సదస్సు నిర్వహించారు. తమిళనాడు వ్యవసాయ వర్సిటీ వీసీ గీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనేందుకు వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించవచ్చన్నారు. వైపరీత్యాల సమయంలో డ్రోన్ టెక్నాలజీతో పంట నష్టాలను అంచనా వేసి రైతులకు పక్కాగా పరిహారం అందించాలని సూచించారు. తిరుపతి వ్యవసాయ వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కోస్తా ప్రాంతంలో వ్యవసాయం, పశుసంవర్ధకం, మత్స్య పరిశ్రమ, ఉద్యానపంటల సాగుకు ఆస్కారం ఉందన్నారు. అలాగే కోస్తా ప్రాంతాలు జీవవైవిధ్యానికి నిలయమని తెలిపారు. పరిశోధన డైరెక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్రంలో 974కిలోమీటర్ల మేర తీర ప్రాంతం విస్తరించి ఉందన్నారు. ఇస్రో డైరెక్టర్ డి.గౌరిశంకర్ మాట్లాడుతూ క్షిపణుల ద్వారా కోస్తా తీర ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం, మట్టిలోని తేమ శాతం, ప్రతి 12రోజులకు సముద్ర మట్టం పెరుగుదల వంటి అంశాలను నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం సదస్సు ఉద్దేశాలను వివరించే సావనీర్, ఇతర ప్రచురణలను ఆవిష్కరించారు. శాస్త్రవేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కేంద్ర చౌడు నేలల పరిశోధనా సంస్థ డైరెక్టర్ సీపీ శర్మ, వెటర్నరీ వర్సిటీ వీసీ వి.పద్మనాభరెడ్డి, వ్యవసాయ పరిశోధనా స్థానం డైరెక్టర్ సి.రమణ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల
# జిల్లా అధ్యక్షుల నియామకం

**చిత్తూరు కలెక్టరేట్ :** వైఎస్ఆర్‌సీపీ జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులను నియమిస్తూ బుధవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వుల మేరకు యూత్ వింగ్ అధ్యక్షునిగా అజయ్‌కుమార్, మహిళా విభాగానికి మాధవి, రైతు విభాగానికి దయాకర్‌రెడ్డి, బీసీ సెల్ శివప్రసాద్‌యాదవ్, ఎస్సీ సెల్‌కు నళిని బాబు, ఎస్టీ సెల్‌కు సుబ్రమణ్యం, మైనారిటీ సెల్‌కు మహమద్ రసూల్, విద్యార్థి విభాగానికి ఓబుల్‌రెడ్డి , వైఎస్ఆర్ సేవాదళ్‌కు ఢిల్లీబాబు, వైఎస్ఆర్‌టీయూసీకి ఉపేంద్రరెడ్డి, పంచాయతీ రాజ్ వింగ్‌కు చెన్నకేశవరెడ్డి , ఐటీ విభాగానికి మదన్‌మోహన్‌రెడ్డి, కల్చరల్ విభాగానికి శాస్త్రిరాజు, గ్రీవెన్స్ సెల్‌కు పెద్దదస్తగిరి, డాక్టర్స్ విభాగానికి డాక్టర్ కె.రమేష్, వాణిజ్య విభాగానికి ప్రశాంత్‌గుప్త, వికలాంగుల విభాగానికి చల్లామోహన్, క్రిస్టియన్ మైనారిటీ సెల్‌కు పాల్‌రాజు, పబ్లిసిటీ విభాగానికి సురేష్ , వీవర్స్ విభాగానికి శివకుమార్ లను నియమించారు. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పతిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా ఉంటుందని ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సూచించారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.





# పరమ పావనం.. గిరి ప్రదక్షిణం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కల్యాణం అనంతరం నూతన వధూవరులైన ఆదిదంపతులు బుధవారం ఉదయం కైలాసగిరి ప్రదక్షిణకు బయలుదేరారు. విల్లు, బాణాలు ధరించిన స్వామివారు, అమ్మవారితో కలిసి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలివెళ్లారు. కొండచుట్టు ఉత్సవంలో విదేశీ భక్తులు సందడి చేశారు. శివనామస్మరణ చేస్తూ ఉత్సాహంగా ముందుకు సాగారు. బియ్యపు కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, శ్రీవాణిరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయ కమిటీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, బియ్యపు పవిత్రారెడ్డి, ఆక ర్ష్‌రెడ్డి, ఈఓ సాగర్‌బాబు పాల్గొన్నారు. రాత్రి ముక్కంటి అశ్వవాహనం, జగజ్జనని సింహవాహనంపై పురవీధుల్లో విహరించారు. ఈ క్రమంలో గురువారం స్వామివారి ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణంకానున్నట్లు ఆలయాధికారులు వెల్లడించారు.

– తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)





# అందరికీ సమ'న్యాయం'

- వైఎస్సార్ లా నేస్తం కింద నాలుగో విడత సాయం
- జిల్లాలో 124 మంది న్యాయవాదులకు లబ్ధి

**తిరుపతి అర్బన్/తిరుపతి లీగల్ :** ప్రభుత్వం వైఎస్సార్ లా నేస్తం పథకం కింద జూనియర్ న్యాయవాదులకు అండగా నిలుస్తోంది. బుధవారం ఈ మేరకు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసింది. అందులో భాగంగా జిల్లాలో 124 మంది న్యాయవాదులకు లబ్ధి చేకూరింది. తిరుపతి కలెక్టరేట్‌లో నిర్వహించిన వైఎస్సార్ లా నేస్తం కార్యక్రమానికి అర్హులైన న్యాయవాదులు హాజరయ్యారు. వృత్తిలో నిలదొక్కుకునే వరకు నెలకు రూ.5వేల చొప్పున చేయూతనందించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పుస్తకాలు కొంటున్నా



ప్రభుత్వం ఇస్తున్న లా నేస్తం సొమ్ముతో కొత్తగా వస్తున్న లా పుస్తకాలు, జనరల్స్‌ను కొంటున్నా. భవిష్యత్‌లో న్యాయవాది వృత్తిలో రాణించాలంటే ఆఫీసు లైబ్రరీ ఎంతో అవసరం. యువ న్యాయవాదులకు ఆర్థికంగా సహాయం అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్ సార్‌కు కృతజ్ఞతలు.

– పి.లావణ్య, జూనియర్ న్యాయవాది, తిరుపతి

## ధైర్యంగా ఉంది



కొత్తగా న్యాయవాది వృత్తిలోకి వచ్చా. నిలదొక్కుకునే వరకు ఎవరిపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం సాయం చేయడం ఆనందంగా ఉంది. నెలవారీగా స్టయిఫండ్ ఇస్తుండడంతో ధైర్యంగా పని చేసుకుంటున్నా. ముఖ్యమంత్రి జగనన్న రుణం తీర్చుకోలేం. ఆయన ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్‌లో పేదలకు ఉచితంగా న్యాయ సహాయం అందించాలని నిర్ణయించుకున్నా.

– వి.అన్బురాజ్, జూనియర్ న్యాయవాది, తిరుపతి

## రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్



చరిత్రలో తొలిసారిగా న్యాయవాదు సంక్షేమానికి ప్రభుత్వం రూ.100 కోట్లతో కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసింది. న్యాయవాదుల ఆరోగ్య రక్షణకు, వృత్తిలో రాణించేందుకు ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుంది. కోవిడ్ సమయంలో సైతం ప్రభుత్వం రూ.25కోట్లు అందించి న్యాయవాదులను ఆదుకుంది.

– మునిబాలసుబ్రమణ్యం, సీనియర్ న్యాయవాది, తిరుపతి

## వాల్మీకి, బోయల సంక్షేమమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామూల్ అనందకుమార్

**తిరుపతి అర్బన్ :** వాల్మీకి, బోయల సంక్షేమమే లక్ష్యంగా, వారి స్థితిగతులను అధ్యయనం చేసేందుకే ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసినట్లు కమిషన్ చైర్మన్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ తెలిపారు. బుధవారం తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో వాల్మీకి, బోయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. వారి సమస్యలను సావధానంగా ఆలకించారు. అనంతరం వారి నుంచి వినతులు స్వీకరించారు. దీనిపై నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఆర్డీఓ కనకనరసారెడ్డి, ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి చెన్నయ్య, కుల సంఘాల నేతలు నాగరాజు, పాపయ్య, బాలయ్య, వెంకటరమణ, అమరనాథ్, విశ్వనాథం, రమణ, కిషోర్, కృష్ణప్ప, గుండాల నాయక్, కళావతి, మల్లేష్ నాయక్, అక్కులప్ప నాయక్, వెంకటరమణ పాల్గొన్నారు.

# మహిమాన్వితం.. మహాకుంభాభిషేకం



శిఖర కలశాలను తీసుకువస్తున్న ఉభయకర్తలు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

- చెంగాళమ్మ ఆలయంలో శిఖర కలశాలకు ప్రత్యేక పూజలు

**సూళ్లూరుపేట :** పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో స్వర్ణ విమానగోపుర శిఖర ప్రతిష్ట, మహాకుంభాభిషేక మహోత్సవాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాలకు ఉభయకర్తలు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతి దంపతులు శ్రీకారం చుట్టారు. తిరుమల శ్రీవారి ఆనందనిలయం తరహాలో చెంగాళమ్మ ఆలయ విమానగోపురానికి బంగారుతాపడం పనులకు ఎంపీ వేమిరెడ్డి దంపతులు దాతలుగా వ్యవహరించారు. ఈ క్రమంలో స్వర్ణతాపడం చేసిన 16 శిఖర కలశాలకు అమ్మవారి పాదాల చెంత ప్రత్యేక పూజలు చేశారు. అలాగే విఘ్నేశ్వరపూజ, శైవశుద్ధి మహా పుణ్యాహవచన, పంచగవ్య ప్రాశన, రక్షానిధి, దీక్షా స్వీకరణ, శాలబలి, యాగశాల ప్రవేశం, అస్త్రరాజార్చన, అఖండస్థాపన, యంత్ర మంతానుష్టానాలు, బింబములకు అభ్యంగస్నానం, హారతి మంత్రపుష్పం తదితర వైధిక పూజలు, శిఖర కలశాలకు గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం దాతలు వల్లటూరు మధుసూదన్‌నాయుడు, శాంతి దంపతులు నిర్మించిన ఆస్థాన మండపాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. అనంతరం చేపట్టిన తొలి లక్ష కుంకుమార్చనలో ఎమ్మెల్యే కిలివేటి, ఆలయ కమిటీ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి దంపతులు, ఈఓ ఆళ్ల శ్రీనివాసులు రెడ్డి దంపతులు పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలనుంచి విశేష పూజలు, వైధిక కార్యక్రమాలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి సభ్యులు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, వి.దినేష్‌కుమార్, బి.సునీత, ఓ.బాలసత్యనారాయణ, ఎం.పద్మజ, ఎన్.నాగమణి, పి. మారెమ్మ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, బాలాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్, పార్టీ నేతలు రామ్మోహన్‌రెడ్డి, జనార్ధన్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, వేణుయాదవ్, రామకృష్ణారెడ్డి, మునీష్‌రెడ్డి, తిరుపాల్, సురేష్, దేవేంద్రరెడ్డి పాల్గొన్నారు.



## ఎర్రచందనం స్వాధీనం - ఏడుగురు స్మగ్లర్ల అరెస్ట్



పట్టుబడ్డ స్మగ్లర్లు, స్వాధీనం చేసుకున్న వాహనాలను చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**తిరుపతి అలిపిరి:** గూడూరు అటవీ ప్రాంతంలో ఎర్రచందనం స్వాధీనం చేసుకుని ఏడుగురు స్మగ్లర్లను అరెస్ట్‌చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ మోహన్‌నాయక్ తెలిపారు. మంగళవారం రాత్రి నుంచి గూడూరు మండలం తీపనూరు–మేకనూరు అటవీ ప్రాంతంలో ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం కూంబింగ్ చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా రోడ్డుకు సమీపంలో ఓ కారు, బైక్ నిలిపి వున్నాయని, పోలీసులు ఆ వాహనాల వద్దకు వెళ్లేలోపు వేగంగా వెళ్లిపోయారని చెప్పారు. తమ సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకోగా అక్కడ 12 ఎర్రచందనం దుంగలు ఉన్నాయి. ఆ తర్వాత పోలీసులు కారును వెంబడించి కారు, బైక్ సహా 7గురిని అదుపులోకి తీసుకున్నట్టు చెప్పారు. సంఘటన స్థలంలో ఉన్న 12 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిలో పుత్తూరు మండలానికి చెందిన డి.సుబ్రమణ్యం (60), నగరికి చెందిన ఎస్.పళనివేలు (50), ఎంజీ శేఖర్ (42), గూడూరు మండలం నేలటూరుకు చెందిన గోర్తల కృష్ణయ్య, (42), దేవిపాళెంకు చెందిన సిద్ధపురెడ్డి ప్రసాద్ (26), మండడి మనోహర్ (57), వరదయ్యపాళెంకు చెందిన సలవారి రవి (35)లుగా గుర్తించి అరెస్టు చేశారు. వీరిపై టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో కేసు నమోదు చేశామన్నారు. దర్యాప్తు కొనసాగుతున్నట్లు చెప్పారు.

## దేశీయ గోజాతుల అభివృద్ధే లక్ష్యం



బారామతి కేవీకేలో టీటీడీ అధికారుల బృందం

**తిరుపతి రూరల్:** దేశీయ గోజాతుల అభివృద్ధే లక్ష్యంగా టీటీడీ విస్తృతంగా అధ్యయనం చేస్తోంది. శ్రీవారికి నైవేద్యం సమర్పించేందుకు నిత్యం 4వేల లీటర్ల గోవు పాల సేకరించేందుకు కృషి చేస్తోంది. ఈ మేరకు టీటీడీ జేఈఓ సదాభార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ హరనాథరెడ్డి, వెటర్నరీ వర్సిటీ విస్తరణ సంచాలకుడు వెంకటనాయుడు బృందం మహారాష్ట్రలోని బారామతి కృషి విజ్ఞాన కేంద్రంలో పర్యటిస్తోంది. బుధవారం ఈ మేరకు జన్యు ప్రక్రియ ద్వారా దేశీయ గోజాతులను అభివృద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించింది. టీటీడీ గోశాలలో రోజూ 4 వేల లీటర్ల స్వచ్ఛమైన దేశవాళీ ఆవు పాల దిగుబడికి అనుసరించాల్సి విధానాలపై శాస్త్రవేత్తలతో చర్చించింది.

## సత్య ప్రమాణానికి సిద్ధం



మాట్లాడుతున్న సిపాయి సుబ్రమణ్యం

**తిరుపతి కల్చరల్ :** బీజేపీ నేతల సవాల్‌ను స్వీకరిస్తున్నామని, కాణిపాకంలో సత్య ప్రమాణం చేయడానికి సిద్ధమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం స్పష్టం చేశారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. బీసీల అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, అందులో భాగంగానే తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. అయితే రూ.కోట్లు చెల్లించి ఎమ్మెల్సీ సీటు సంపాదించానని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీలో నీతిని నమ్ముకుని నిజాయితీగా పనిచేసే బీసీలకు ఎన్నడూ న్యాయం జరగలేదన్నారు. అందుకే టీడీపీని వీడాల్సి వచ్చిందని తెలిపారు. భానుప్రకాష్ కోరితే అయోధ్యలో బలరాముడిపై కూడా ప్రమాణం చేసేందుకు వస్తామని చెప్పారు. బీసీలు ఒకప్పుడు ఎన్టీఆర్‌ను ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు.

# గో బ్యాక్.. పప్పు !



పోలీసులపై దాడిచేస్తున్న టీడీపీ కార్యకర్తలు



నారా లోకేష్ పర్యటించే మార్గంలో రోడ్డు పైన కరపత్రాలు

- లోకేష్ పాదయాత్ర మార్గంలో కరపత్రాలు ప్రత్యక్షం

**సాక్షి, తిరుపతి/రేణిగుంట:** యువగళం పేరుతో నారా లోకేష్ చేపడుతున్న పాదయాత్రలో ఏర్పేడు మండలంలో బుధవారం అనూహ్య సంఘటన చోటుచేసుకుంది. 'గో బ్యాక్ పప్పు' అంటూ పంపిణీ చేసిన కరపత్రాలు దారిపొడవునా కనిపించాయి. ఆ కరపత్రాల్లో.. ''16మంది ప్రాణాలు తీసిన ఇసుకాసులను వెంటబెట్టుకుని చేసే పాదయాత్ర ఎవరి కోసం..? మనుషుల ప్రాణాలు తీసిన రాక్షసుల కోసమా..? మరొకసారి ప్రజలను వెన్నుపోటు పొడవడం కోసమా..? అసత్య ఆరోపణల యాత్రను ప్రజలు స్వాగతించరు.. గత హామీలను నెరవేర్చలేని మీ పాలన ఎందుకు..? గో బ్యాక్ పప్పు'' అంటూ 2017 ఏప్రిల్ 21న ఏర్పేడులో జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రైతుల ఫొటోలతో కూడిన కరపత్రాలు నారా లోకేష్ పర్యటించే ప్రాంతంలో పలుచోట్ల రోడ్డుపై కనిపించాయి.

### రెచ్చగొట్టి.. రచ్చ చేశారు

మునగలపాలెం, వికృతమాల మీదుగా మర్రిమందకు చేరుకున్న పాదయాత్రలో టీడీపీ శ్రేణులు రెచ్చగొట్టి రచ్చ చేశాయి. మర్రిమంద పాఠశాలలో స్థానికులు ఉండడాన్ని గమనించిన టీడీపీ శ్రేణులు దుష్ప్రచారం చేశారు. పాదయాత్రలో లోకేష్‌పై రాళ్లు రువ్వడానికి పాఠశాలలో ఉన్నారంటూ గొడవకు దిగారు. పాఠశాలలో ఉన్న స్థానికులపై టీడీపీ శ్రేణులు, విజయవాడకు చెందిన ప్రైవేటు సైన్యం దాడిచేయడానికి యత్నించారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. టీడీపీ శ్రేణులు మాత్రం ఆగకుండా నెట్టుకుంటూ పోలీసులపై దాడికి దిగారు. పోలీసులు టీడీపీ కార్యకర్తలను శాంతింపజేసేందుకు తీవ్రంగా శ్రమించారు. అయినా వినకుండా రెచ్చిపోయారు. స్థానికులు, పోలీసులపై దాడులకు తెగబడ్డారు.

### టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు

**ఏర్పేడు:** ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి బుధవారం రాత్రి తెలిపారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా గుర్తు తెలియని టీడీపీ కార్యకర్తలు, నాగాలమ్మ ఆలయం, బండారుపల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కోబాక ప్రాంతాల్లో బ్యానర్లు, కరపత్రాలు జెండాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున తహసీల్దారు ఉదయ్ సంతోష్ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

# ఆత్మహత్య కేసుపై విచారణ

**తిరుచానూరు (చంద్రగిరి) :** స్థానిక ఎస్‌వీపీ కాలనీకి చెందిన నితిన్‌సింగ్ అనే వ్యాపారి ఈ నెల17వ తేదీన ఆత్మహత్యకు పాల్పడిన కేసులో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. మృతుడి భార్య పరమేశ్వరిబాయి ఫిర్యాదు మేరకు తిరుచానూరు అమ్మవారి ఆలయ అర్చకుడు ప్రతాప్ బాబుస్వామి, ఆయన భార్య పద్మశ్రీవాణిపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్రమణ్యం రెడ్డి బుధవారం తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్నట్లు బాధితులు చీటీలకు కట్టిన రశీదులు, ఇతర ఆధారాలను పరిశీలిస్తున్నామన్నారు. పారదర్శకంగా దర్యాప్తు చేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.